క్లీనింగ్ చేయరు..! లిఫ్ట్ పనిచేయదు..!!

- అధ్వానంగా కలెక్టరేట్‌లోని స్నేహ సిల్వర్‌జూబ్లీ బిల్డింగ్
- ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లు
- వాటర్‌క్యాన్లు పైకి రాక.. తాగునీటికీ అవస్థలు
- గ్రౌండ్ ఫ్లోర్, మెట్లపై దుమ్ము, పావురాల వ్యర్థాలు

హైదరాబాద్‌సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హైదరాబాద్ కలెక్టరేట్ అధ్వానంగా మారింది. నిర్వహణలోపంతో పలు విభాగాలు అస్తవ్యస్తంగా తయారవుతున్నాయి. ప్రధానంగా పరిపాలన విభాగం అధికారులు.. కలెక్టరేట్‌లోని ప్రాంగణం, పరిసరాల శుభ్రతను పట్టించుకోకపోవడంతో దుర్గంధభరితమవుతున్నాయి. దీంతో కలెక్టరేట్‌కు వస్తున్న ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఇతరశాఖల అధికారులు, ఉద్యోగులు ఇక్కడి పరిస్థితిని చూస్తూ అసహనానికి లోనవుతున్నారు. కొంతమంది ఒకసారి వస్తే.. మరోసారి వచ్చేందుకు వెనకంజ వేస్తున్నారు. రంగారెడ్డి కలెక్టరేట్‌ను కొంగరకలాన్‌లో నిర్మించిన నూతన భవనానికి తరలించిన తరుణంలో హైదరాబాద్ కలెక్టరేట్‌ను ఏడాదిన్నర క్రితం లక్డీకపూల్‌లోని పాత రంగారెడ్డి కలెక్టరేట్‌కు తీసుకొచ్చారు. గతంలో నాంపల్లిలో హైదరాబాద్ కలెక్టరేట్ ఉండడంతో అధికారులు, ఉద్యోగులు, పౌరులు.. రాకపోకలకు ఇబ్బందులు పడేవారు. అయితే లక్డీకపూల్‌కు కలెక్టరేట్‌ను తరలించడంతో అందరికీ అనుకూలంగా మారింది. కాగా, ఇక్కడ విశాలమైన భవనాలతోపాటు అధికారులు, ఉద్యోగులకు ప్రత్యేక గదులు ఉండడంతో సాఫీగా పనిచేస్తున్నారు. రోడ్డు పక్కనే ఆర్టీసీ బస్సులు, మెట్రో రైళ్లు ఉండడంతో వారికి ప్రయాణ ఇబ్బందులు తప్పాయి. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ కలెక్టరేట్‌లోని ప్రాంగణం, వివిధ విభాగాల శుభ్రతను గాలికి వదిలేయడంతో ఇబ్బందులు పడుతున్నారు.

అధ్వానంగా స్నేహ సిల్వర్‌జూబ్లీ భవనం..

కలెక్టరేట్‌లోని మెయిన్ బిల్డింగ్ నిర్వహణ కాస్తా మెరుగ్గా ఉన్నప్పటికీ పక్కనే ఉన్న స్నేహ సిల్వర్ జూబ్లీ భవనం నిర్వహణ దయనీయంగా మారింది. ఈ భవనంలో ఐదు అంతస్తులున్నాయి. ఇందులో స్త్రీ, శిశు సంక్షేమం, ఎస్సీ ఎస్టీ, మైనార్టీ వెల్ఫేర్, ల్యాండ్ రికార్డ్స్, జిల్లా ప్రజాసంబంధాలు, తదితర శాఖలు పనిచేస్తున్నాయి. ఆయా ఆఫీసుల్లో కలిపి దాదాపు 60 నుంచి 70 మంది అధికారులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. కలెక్టరేట్ మెయిన్ బిల్డింగ్‌కు అనుసంధానంగా కొనసాగుతున్న ఈ భవనం నిర్వహణను పట్టించుకపోవడంతో ఉద్యోగులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా బిల్డింగ్ గ్రౌండ్ ఫ్లోర్ నుంచి మొదలుకుని 5వ అంతస్తు వరకు ఉన్న మెట్లపై దుమ్ము, ధూళి పేరుకుపోతోంది. పావురాల వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడే ఉండడంతో దుర్వాసన వస్తోంది. దీంతో వారు ముక్కు మూసుకుని తమ ఆఫీసులకు వెళ్తూ పనిచేస్తున్నారు.

నెలలో రెండు, మూడుసార్లు పాడైపోతున్న లిఫ్ట్..

స్నేహ సిల్వర్ జూబ్లీ భవనంలో ఉద్యోగులు, ప్రజల సౌకర్యార్థం రెండు లిఫ్టులను ఏర్పాటు చేశారు. ఇందులో ఒకటి చాలాకాలం నుంచి పనిచేయడం లేదు. మరో లిఫ్టు నెలలో రెండు, మూడుసార్లు పాడైపోతోంది. లిఫ్ట్ పనిచేయకపోవడంతో తాము పనిచేసే అంతస్తులోకి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నామని ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లు చెబుతున్నారు. లిఫ్టు సమస్యపై సంబంధిత అధికారులకు చెబుతున్నప్పటికీ పట్టించుకోవడంలేదని వారు ఆరోపిస్తున్నారు. నాలుగు రోజుల నుంచి లిఫ్ట్ వినియోగంలో లేకపోవడంతో ఉద్యోగులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు.

కలెక్టర్ గారూ.. పట్టించుకోరూ..!

కలెక్టరేట్‌లోని స్నేహ సిల్వర్ జూబ్లీ బిల్డింగ్ నిర్వహణను కలెక్టర్ పట్టించుకోవాలని ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లు, సాధారణ ప్రజలు కోరుతున్నారు. భవనం పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. తరచూ లిఫ్ట్ పాడైపోతుండడంతో మెట్లు ఎక్కి వెళ్లలేకపోతున్నామని ఉద్యోగులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా, స్నేహ సిల్వర్ జూబ్లీ బిల్డింగ్‌లోని లిఫ్టుతోపాటు మెయిన్ బిల్డింగ్‌లోని లిఫ్టు పరిస్థితి కూడా భయానకంగా మారింది. ఈ బిల్డింగ్‌లో కూడా 5 అంతస్తులుండగా.. దాదాపు 130 మంది అధికారులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇందులోని లిఫ్టు కూడా పైకి వెళ్తున్న క్రమంలో అటు ఇటు శబ్దం చేస్తూ ఊగుతోంది. దీంతో ఎక్కడ ఆగిపోతుందో.. ఎక్కడ కింద పడతుందో తెలియని పరిస్థితి నెలకొంది. లిఫ్టు పరిస్థితిని తెలుసుకున్న కొందరు ఉద్యోగులు మెట్లపై నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా.. మరికొందరు తప్పనిసరి పరిస్థితుల్లో అందులో ఎక్కి భయంభయంగా వెళ్తున్నారు. భవనాల నిర్వహణపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి, తమను ఆదుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.


అధ్వానంగా కలెక్టరేట్ భవనం పరిసరాలు


నాటిన మొక్క వద్ద మాజీ ఎమ్మెల్యే చింతల తదితరులు

మొక్క నాటిన చింతల

బంజారాహిల్స్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ 'ఏక్ పేడ్ మా కే నామ్' అన్న పిలుపు మేరకు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మొక్కను నాటారు. గురువారం బంజారాహిల్స్ రోడ్డు నంబర్.2 సాగర్‌సొసైటీ కాలనీ బూత్ నం.130లో బీజేపీ నాయకులతో కలిసి అమ్మ పేరు మీద ఒక మొక్క అంటూ మొక్కను నాటారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అమ్మ పేరుపై ఒక మొక్క ఉద్యమాన్ని మోదీ ప్రారంభించారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న బ్రహ్మనాయుడు కాపు సంఘం నేతలు

వంగవీటి మోహనరంగాకు నివాళి

బంజారాహిల్స్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నంబర్.10లోని బంజారాభవన్ వద్ద బ్రహ్మనాయుడు కాపు సంఘం నాయకుల ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా జయంతిని గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కేన్సర్ ఆస్పత్రి వద్ద పండ్లు పంచిపెట్టారు. 500 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్ నాయుడు, సాయి నాయుడు, ఏసుబాబు, సత్యనారాయణ, కృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

టీజేఎస్‌లోకి డాక్టర్ గుండ్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముదిరాజ్ మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గుండ్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్ తెలంగాణ జనసమితి (టీజేఎస్)లో సభ్యత్వం స్వీకరించారు. గురువారం పార్టీ కార్యాలయంలో టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ కండువా కప్పి శ్రీనివాస్ ముదిరాజ్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రొఫెసర్ కోదండరామ్ నేతృత్వంలో ముదిరాజ్ రిజర్వేషన్ల సమస్య పరిష్కృతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బైరి రమేష్, నిజ్జన రమేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు 3 గంటలు ఆలస్యం

హైదరాబాద్ సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి న్యూఢిల్లీకి శుక్రవారం ఉదయం 6గంటలకు వెళ్లాల్సిన తెలంగాణ ఎక్స్‌ప్రెస్ మూడు గంటలు ఆలస్యంగా బయల్దేరుతుందని దక్షిణమధ్య రైల్వే ప్రకటించింది. గురువారం రాత్రికి న్యూఢిల్లీ నుంచి హైదరాబాద్ రావాల్సిన తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు ఆలస్యంగా నడుస్తుండడమే ఇందుకు కారణమని రైల్వే అధికారులు తెలిపారు. సిర్పూర్-కాగజ్‌నగర్ సమీపంలో ట్రాక్ మరమ్మతు పనులు జరుగుతున్నందున పలు రైళ్లు రద్దయ్యాయని, ముఖ్యమైన రైళ్లు గంటల కొద్దీ ఆలస్యంగా నడుస్తున్నాయని తెలిపారు.

నానో మెటీరియల్‌కు పెరుగుతున్న ప్రాధాన్యం

- సదరన్ డెన్మార్క్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ వై.కె.మిశ్రా


వై.కె.మిశ్రాను సత్కరిస్తున్న గీతం యాజమాన్యం

పటాన్‌చెరు రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నానో మెటీరియల్‌కు ప్రాధాన్యం పెరుగుతున్నదని, వాటిపై విశేష రీతిలో పరిశోధనలు జరుగుతున్నట్టు దక్షిణ డెన్మార్క్ విశ్వవిద్యాలయంలోని స్మార్ట్ మెటీరియల్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ యోగేంద్ర కుమార్ మిశ్రా చెప్పారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ అధునాతన సాంకేతికతల కోసం టెట్రా పోడ్స్ ఆధారిత స్మార్ట్ మెటీరియల్స్ అనే అంశంపై గురువారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. స్మార్ట్ 3డీ నానో మెటీరియల్స్ అభివృద్ధిలో సంక్లిష్ట ఆకారపు నానోస్ట్రక్చర్ల ప్రాముఖ్యత గురించి ఆయన వివరించారు. జింక్ ఆక్సైడ్ టెట్రాపోడ్‌లను సంశ్లేషణ చేయడం కోసం జ్వాల ఆధారిత ఒక అడుగు(సింగిల్ స్టెప్) విధానాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించడంతో పాటు వివిధ సాంకేతిక అనువర్తనాలలో వాటి బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకుల సందేహాలకు ఆయన సుదీర్ఘ వివరణ ఇచ్చారు. తొలుత, భౌతికశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సయన్ చౌదరి అతిథిని పరిచయం చేసి కార్యక్రమాన్ని నిర్వహించారు. భౌతిక, రసాయన శాస్త్రాల విభాగాధిపతులు ప్రొఫెసర్ టి.విశ్వం, డాక్టర్ గౌసియాబేగం స్మార్ట్ మెటీరియల్స్ రంగంలో చేసిన విలువైన కృషిని గుర్తిస్తూ ప్రొఫెసర్ మిశ్రాను సత్కరించారు.

జట్టుగా ఉంటేనే విజయాలు

ఫిక్కీ సదస్సులో టైటాన్ వాచ్ డివిజన్ సీఈఓ సువర్ణ మిత్ర



కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

రాయదుర్గం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జట్టుగా ఉంటేనే విజయాలు సాధించగలమని, ఉద్యోగులను జాగ్రత్తగా చూసుకుంటే వారే సంస్థను విజయపథంలో నిలుపుతారని టైటాన్ వాచెస్ వేరబుల్ డివిజన్ సీఈఓ సువర్ణ మిత్ర అన్నారు. టీహబ్‌లో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన 'టాటా లెగసీ- లివింగ్ వ్యాల్యూస్' అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరోనా సమయంలో ఆరోగ్య సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల చేతి గడియారాల కొనుగోళ్లు పడిపోయాయని, కరోనా తర్వాత తిరిగి పుంజుకున్నాయని పేర్కొన్నారు. సెల్‌ఫోన్ వంటి ఎన్ని ఉపకరణాలు వచ్చినా స్టేటస్ సింబల్‌గా మారిన చేతి గడియారాలకు డిమాండ్ తగ్గదన్నారు. టైటానిక్‌ను అత్యంత విశ్వసనీయ బ్రాండ్‌గా మార్చడంలో మహిళల పాత్ర గురించి మాట్లాడుతూ, ఒక వ్యక్తి కంటే మహిళలు కలిసి పనిచేస్తే చాలా అందంగా ఉంటారని వాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ఫిక్కీ హైదరాబాద్ చాప్టర్ చైర్‌పర్సన్ ప్రియాగజ్దర్‌తో పాటు ఫిక్కీ సభ్యులు పాల్గొన్నారు. ఉక్కు నుంచి ఆటోమొబైల్స్ వరకు, ఐటీ నుంచి వినియోగ వస్తువులు, తినదగిన వాటి నుంచి ధరించగలిగే వస్తువులు, సమాజానికి తిరిగి ఇవ్వాలనే వారి లోతైన నమ్మకానికి నిదర్శనమని అన్నారు.

నార్కొటిక్ వింగ్ పోలీసుల దాడులు

- పలు ప్రాంతాల్లో 155 కిలోల గంజాయి స్వాధీనం
- ఎనిమిది మంది గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

హైదరాబాద్ సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసులతో కలిసి నగరంలో పలు ప్రాంతాల్లో హైదరాబాద్ నార్కొటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (హెచ్‌న్యూ) పోలీసులు దాడులు చేసి ఎనిమిది మంది గంజాయి విక్రేతలను అరెస్ట్ చేశారు. మూడు కేసులకు సంబంధించి నిందితుల నుంచి 155 కిలోల గంజాయి, స్కార్పియో కారు, పాసింజర్ ఆటో, 9 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఒడిషా మల్కాన్‌గిరికి చెందిన మంజిత్ థాలి అలియాస్ జీతు గంజాయి స్మగ్లర్. ఇతడు గతంలో పలు కేసుల్లో అరెస్టయ్యాడు. ఇతడు ఒడిషా మల్కాన్‌గిరి ప్రాంతానికి చెందిన అనిల్ ధానాజీ ఘూంటే, శుశాంత్ మిశ్రీ, సుమంత్ మండల్‌లతో కలిసి గంజాయి దందా చేస్తున్నాడు. పక్కా సమాచారమందుకున్న పోలీసులు వీరిని అరెస్ట్ చేశారు. మరో కేసులో ఆసిఫ్‌నగర్‌లో గంజాయి విక్రయిస్తున్న జి దేవరాజ్ సింగ్‌ను అరెస్ట్ చేశారు.

రౌడీషీటర్ గంజాయి దందా

మంగళ్‌హాట్‌కు చెందిన ఎస్.లఖన్‌సింగ్ అలియాస్ లఖన్ అలియాస్ గోరుపై మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ రౌడీషీటర్ నమోదై ఉంది. హత్య, హత్యాయత్నం, బెదిరింపులు వంటి కేసుల్లో నిందితుడిగా ఉన్న లఖన్‌సింగ్ గంజాయి విక్రయాలు చేస్తున్నాడు. అతడిపై మూడు ఎన్‌డీపీఎస్ కేసులు ఉండటంతో పీడీయాక్ట్ కూడా నమోదు చేశారు. జైలు నుంచి విడుదలైన అతడు గంజాయి దందా చేస్తున్నాడు. లఖన్‌సింగ్ ఈస్ట్‌గోదావరి ప్రాంతానికి చెందిన చిన్న రాథోడ్ గోవింద్ వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్నాడు. హెచ్‌న్యూ పోలీసులు లఖన్‌సింగ్‌తో పాటు రాథోడ్ గోవింద్‌ను కూడా అరెస్ట్ చేశారు.

● భక్తుల బారీకేడ్ల నుంచి రాకపోకలు!


ఈ నెల 9న బలంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణం సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తుల కోసం బారీకేడ్లను ఏర్పాటు చేశారు. ఇందులో నుంచి ద్విచక్రవాహనదారులు రాకపోకలు సాగిస్తుండగా 'ఆంధ్రజ్యోతి' కెమెరా క్లిక్ మనిపించింది
ఫొటో: ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ఎఫ్ఆర్ఎస్ సర్వర్ పనిచేయక హాజరు పడట్లేదు

- కమిషనర్‌కు విన్నవించిన జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ వర్కర్ల సంఘం ప్రతినిధులు

ఖైరతాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో కాంట్రాక్ట్ వర్కర్ల హాజరు కోసం వినియోగిస్తున్న ఎఫ్ఆర్ఎస్ విధానంలో సాంకేతిక లోపాల వల్ల హాజరుపడక చాలామంది వేతనాల్లో కోతలు పడుతున్నాయని తెలంగాణ జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. యూనియన్ అధ్యక్షుడు మిద్దె కృష్ణ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ కార్యాలయంలో కమిషనర్ ఆమ్రపాలికి గురువారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఏలకు ఇతర విధులు వేసినప్పుడు ఈ విధానంలో హాజరు తీసుకోవడం ఇబ్బందిగా ఉందన్నారు. అప్పుడప్పుడు హాజరు పడక కాంట్రాక్ట్ వర్కర్ల జీతాల్లో వేలాది రూపాయలు కోత పడుతున్నాయని, చాలీచాలని జీతాలతో అవస్థలు పడుతున్న వారిని ఆదుకోవాలని కోరారు. కార్మికులకు ఉదయం పూట బస్సులు దొరకక కొంత ఆలస్యమైనా హాజరు పడడం లేదని, ఈ విషయమై అరగంట పాటు వెసులుబాటు కల్పించాలని కోరారు. హాజరు కోసం ఎస్ఎఫ్ఏలు తమ సొంత మొబైల్ ఫోన్లను వినియోగిస్తున్నారని, అవి పాడైతే ఇబ్బందులు వస్తున్నాయని, వారికి ఫోన్లను అందించాలని కోరారు.



ఆమ్రపాలికి వినతిపత్రం ఇస్తున్న మిద్దె కృష్ణ తదితరులు

పార్కుల్లో శుభ్రత, వీడీసీసీ రోడ్డు పనులపై ఆరా


జేవీఆర్ పార్కులో వాకర్లతో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, చిత్రంలో ఉప కమిషనర్ ప్రశాంతి, అధికారులు

ఖైరతాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనురాగ్ జయంతి ప్రతి రోజూ ఒక సర్కిల్‌లో పర్యటిస్తున్నారు. గురువారం ఆయన జూబ్లీహిల్స్ సర్కిల్-18లో పర్యటించి పలు పార్కులను, అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. బంజారాహిల్స్ ఎన్‌బీటీనగర్‌లో కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటును అధికారులతో పరిశీలించి పలు సలహాలు ఇచ్చారు. శ్రీనగర్ కాలనీలో వీడీసీసీ రోడ్డు పనులను పరిశీలించారు. 532 మీటర్ల రోడ్డు పనుల్లో మిగిలిన 200 మీటర్ల రోడ్డును పూర్తి చేయాలని, దీంతో పాటు అక్కడ స్థానికులకు అవసరమైన కనెక్టింగ్ రోడ్డును వేయాలని కోరారు. జేవీఆర్ పార్కును పరిశీలించిన జోనల్ కమిషనర్ అందులో సందర్శకులు కూర్చునేందుకు వేసిన బెంచీలు విరిగిపోయి ఉండడం, పార్కు చెట్ల ఆకులతో నిండి ఉండడం, అపరిశుభ్రతపై అధికారులను మందలించారు. పార్కులో పరిశుభ్ర వాతావరణం ఉండేలా చేయాలని సూచించారు. దీంతో పాటు శ్రీనగర్‌కాలనీలోని క్లైంబర్స్ పార్కును పరిశీలించిన ఆయన అక్కడ వాకర్లు, సందర్శకులకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్కిల్-18 ఉప కమిషనర్ ప్రశాంతి, ఇంజనీరింగ్, మెడికల్, విద్యుత్, అర్బన్ బయోడైవర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

వంగపల్లి దీక్షను విజయవంతం చేయాలి

ఎర్రగడ్డ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పరిష్కరించకుండా జాప్యం చేస్తూ మాదిగలకు అన్యాయం చేస్తున్న కేంద్రం వైఖరికి నిరసనగా టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ చేపట్టనున్న దీక్షను విజయవంతం చేయాలని ఆ సంఘం హైదరాబాద్ జిల్లా యువసేన కన్వీనర్ నాందేడ్ తరుణ్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం టీఎస్ ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో దీక్ష కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 7న టీఎస్ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ఇందిరాపార్కు వద్ద దీక్ష చేపడతారని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా కార్యనిర్వాక అధ్యక్షుడు బోటిక్ మహేష్‌మాదిగ, జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొత్తూరు విశాల్, నాయకులు ధనుంజయ్, తరుణ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని విడుదల చేస్తున్న టీఎస్ ఎమ్మార్పీఎస్ నాయకులు


భారత్‌బంద్‌లో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించండి

బోరబండ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం తేవాలని ఎస్ఎఫ్ఐ జోన్ కార్యదర్శి సునీల్ డిమాండ్ చేశారు. భారత్‌బంద్‌లో భాగంగా గురువారం బోరబండ, రెహ్మత్‌నగర్‌లోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను బంద్ చేయించారు. కార్యక్రమంలో నాయకులు మనోజ్, వెంకట్, కవిత, సచిన్, అంజి, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.


బ్యాగ్‌లు తీసుకున్న విద్యార్థులతో విజయారెడ్డి

విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌ల పంపిణీ

ఖైరతాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఫౌండేషన్ ఛైర్మన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాక్టీసింగ్ వాసవీ పాఠశాలలో గురువారం విద్యార్థులందరికీ బ్యాగ్‌లను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


దీనను అభినందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్ తదితరులు

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక

ఎర్రగడ్డ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అథ్లెటిక్ మీట్ పోటీలకు ఎర్రగడ్డ సెయింట్ అల్ఫాన్సా స్కూల్ 5వ తరగతి విద్యార్థిని కె.దీన ఎంపికయ్యారు. జీటీఎస్ గ్రౌండ్‌లో గురువారం ఆమెను ప్రముఖ సంఘ సేవకుడు కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యుడు రాజశేఖర్ అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ నిర్వహించిన కిడ్స్ అథ్లెటిక్ ఛాంపియన్-2024లో వెయ్యి మంది పాల్గొన్నారని తెలిపారు. 10 సంవత్సరాల గ్రూప్‌లో దీన లాంగ్‌జంప్‌లో రెండోస్థానం, 300 మీటర్ల విభాగంలో మూడోస్థానం సాధించారని తెలిపారు. కార్యక్రమంలో కోచ్ అనిల్, తదితరులు పాల్గొన్నారు.

● అవగాహన


డీజీ లోన్, స్టార్ పవర్జ్ డిజిటల్ సంస్థ ఉద్యోగులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న బేగంపేట టీటీఐ ఏసీపీ శంకర్ రాజు తదితరులు
- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

ఆర్టీసీ బస్సు ఢీకొని రైల్వే ఉద్యోగి మృతి


విష్ణుప్రభు(ఫైల్)

బేగంపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని రైల్వే ఉద్యోగి మృతిచెందాడు. ఈ సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీవోలీ థియేటర్ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేట ఆంజనేయనగర్‌కు చెందిన తోట విష్ణుప్రభు(58) రైల్వేలో విధులు నిర్వహిస్తున్నారు. సికింద్రాబాద్ చిలకలగూడలో గల రైల్వే మెడికల్ స్టోర్‌లో విధులు ముగించుకుని గురువారం సాయంత్రం యాక్టీవాపై ఇంటికి బయలుదేరాడు. టీవోలీ థియేటర్ సమీపంలోని సీఏబ్ల్యూ మెస్ వద్దకు రాగానే హైదరాబాద్ నుంచి బోదన్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా ఢీకొట్టింది. దీంతో ఆయన కిందపడగా బస్సు వెనక చక్రం తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన ప్రయాణికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు చంద్ర కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నాగరాజు తెలిపారు.



బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణ ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు అందజేస్తున్న ఆలయ ప్రతినిధులు

ఎల్లమ్మ కల్యాణానికి ఎమ్మెల్యే తలసానికి ఆహ్వానం

మారేడుపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణం ఈ నెల 9వ తేదీన జరుగనుంది. కల్యాణానికి హాజరుకావాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను గురువారం తన నివాసంలో ఆలయ నిర్వాహకులు కలిసి ఆహ్వానం పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేసి ప్రసాదాలను అందజేశారు. ఈ నెల 6వ తేదీన బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. దేవాదాయ, జీహెచ్‌ఎంసీ, వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్, ఆర్ అండ్ బీ, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు తదితర శాఖలకు చెందిన అధికారులతో కలిసి పర్యటించి ఏర్పాట్లపై పర్యవేక్షించనున్నట్లు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు.



రెవెన్యూ అధికారులకు వినతి పత్రం సమర్పిస్తున్న బీజేపీ మహిళా శ్రేణులు

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

● రెవెన్యూ అధికారులకు బీజేపీ మహిళల వినతి

అడ్డగుట్ట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని లేదంటే ఆందోళన చేస్తామని బీజేపీ మహంకాళి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు అనిత ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల గ్యారంటీలు అమలు చేయడంలేదని గురువారం మారేడుపల్లి రెవెన్యూ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడిచినా ఇప్పటి వరకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపించారు. తాము ఇచ్చిన వినతి పత్రాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని బీజేపీ మహిళలు రెవెన్యూ అధికారులను కోరారు. హామీలు అమలుచేయకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, సీనియర్ నాయకుడు నాగేశ్వర్ రెడ్డి, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి అనుష, వైశాలి, కళావతి, సరోజ, శారద, లక్ష్మి, మంజుల, అనూష, లత, సుచిత్ర, పోచయ్య, భక్షపతి, తార్నాక డివిజన్ అధ్యక్షుడు రాము, సాయిబాబు పాల్గొన్నారు.



వివిధ విభాగాల అధికారులు, నాయకులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బోనాల ఏర్పాట్లపై సమీక్షా సమావేశం

బౌద్ధనగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ కట్టమైసమ్మ, నల్లపోచమ్మ ఆలయంలో ఈ నెల 28, 29వ తేదీల్లో నిర్వహించే ఆషాడబోనాల ఏర్పాట్లపై గురువారం ఉదయం ఆలయ ప్రాంగణంలో వివిధ విభాగాల అధికారులు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. టీపీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని జీహెచ్‌ఎంసీ, జలమండలి, పోలీస్, ట్రాఫిక్ పోలీస్ అధికారులు, దేవాదాయశాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్నిచర్యలు చేపట్టాలని సూచించారు. రెండు రోజుల పాటు ట్రాఫిక్‌ను మళ్లించాలని కోరారు. సమావేశంలో చిలకలగూడ పీఎస్ ఇన్‌స్పెక్టర్ అనుదీప్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.శ్రీనివాసులు, జలమండలి డిప్యూటీ జీఎం కృష్ణ, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సంధ్యారాణి, ఆలయ కార్యనిర్వాహణాధికారి మహేందర్‌గౌడ్, చైర్మన్ గుంటి కృష్ణ, సభ్యుడు దేవేందర్, ప్రధానార్చకుడు తిరుమలాచార్యులు తదితరులు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు వారిని సన్మానించారు.

ప్రైవేటు యూనివర్సిటీలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్



లింబాద్రికి వినతి పత్రం అందజేస్తున్న జాజుల లింగం గౌడ్ తదితరులు

తార్నాక, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం వివాదంలో ఉన్న ప్రైవేటు భూముల్లో ఇష్టానుసారంగా అనుమతిలిచ్చిన ప్రైవేటు యూనివర్సిటీలపై సమగ్ర దర్యాప్తు జరిపి వాటిని రద్దు చేయాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అన్నారు. గురువారం తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జాజుల లింగం గౌడ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇళ్ల స్థలాల క్రింద నమోదైన భూములకు, వివాదంలో ఉన్న భూములకు కూడా అనుమతులు ఇచ్చారని, అటువంటి వాటిపై సమగ్ర దర్యాప్తు చేపట్టి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రైవేటు యూనివర్సిటీలు రాజ్యాంగ బద్ధంగా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేయకుండా, ఇష్టారాజ్యంగా వ్యవరిస్తున్నాయని ఆరోపించారు.

ఉజ్జయినీ మహంకాళి బోనాల ఉత్సవ కమిటీ నియామకం

సికింద్రాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ప్రసిద్ధి చెందిన సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాలను పురస్కరించుకుని ఉత్సవ కమిటీని నియమించారు. ఈ నెల 21, 22వ తేదీల్లో వైభవంగా జరిగే బోనాల పండుగకు 12 మందితో కూడిన ఉత్సవ కమిటీని నియమిస్తూ గురువారం దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతు ఉత్వర్వులు జారీ చేశారు. దుద్యాల మురళీగౌడ్, వేణుగోపాల్‌గౌడ్, చక్రపాణి, కృష్ణ, మహేష్‌కుమార్, శివనారాయణ, రమేష్, ఉషారమణి, శ్రీకాంత్, విశాల్, సవిత, సాయి సందీప్‌లతో ఉత్సవ కమిటీని నియమించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువతి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఓ యువతి రైలుకు ఎదురుగా వచ్చి ఆత్మాహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్స పొందుతూ మరణించిన ఘటన నేరెడ్‌మెట్ రైల్వే స్టేషన్‌లలో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.... కాప్రా సాయిబాబానగర్‌కు చెందిన దహర లక్ష్మి కుమార్తె వెంపటి రేష్మ(24). ఆమె చిన్నతనంలోనే తండ్రి చనిపోయాడు. అప్పటి నుంచి తల్లి పెంచి పెద్ద చేసింది. తనకు పెళ్లి చేయాలని కుటుంబ సభ్యులు అనుకున్నారు. తనకు పెళ్లి ఇష్టం లేక ఈనెల 2న రోజులాగే డ్యూటీకి వెళ్లిన రేష్మ తిరిగి సాయంత్రం నేరెడ్‌మెట్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. స్టేషన్‌లో ప్లాట్ ఫాంపై ఓ రైలు ఆగింది. రైలు కదులుతున్న సమయంలో రేష్మ ఒక్క సారిగా రైలుకు ఎదురుగా దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. తీవ్ర గాయాలతో ఉన్న రేష్మని ఆర్పీఎఫ్ హోంగార్డు సతీష్ వెంటనే 108 అంబులెన్స్‌లో ఈసీఐఎల్‌లోని రాఘవేంద్ర ఆస్పత్రిలో చేర్పించాడు. ఈ విషయాన్ని ఆర్పీఎఫ్ పోలీసులు రేష్మ సోదరుడు శివ మహేష్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. రాఘవేంద్ర ఆస్పత్రికి వచ్చిన కుటుంబ సభ్యులు ఈ నెల 3న ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేయించి బేగంపేట్ కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. సమాచారం అందుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు మృతదేహన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కట్టమైసమ్మ ఆలయంలో పనులు ప్రారంభం

● హాజరైన ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మకమైన చిలకలగూడ కట్టమైసమ్మ, నల్లపోచమ్మ ఆలయంలో గురువారం సాయంత్రం పచ్చరంగు పనులను ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ ప్రారంభించారు. ఈనెల 28, 29వ తేదీల్లో జరిగే ఆషాడబోనాలను పురస్కరించుకుని ఆలయ కార్యనిర్వాహణాధికారి మహేందర్‌గౌడ్‌కు ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ఏడు లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించే అనవాయితీని ప్రారంభించామన్నారు. ఆలయాలకు నిధులను అందించే పద్ధతిని ప్రవేశపెట్టామన్నారు. కట్టమైసమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేశామని, నలభై లక్షలు వెచ్చించి ఆలయానికి అదనపు స్థలాన్ని సమకూర్చామని తెలిపారు. రాజకీయాలకతీతంగా బోనాల ఉత్సవాలు జరుపుకోవాలని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.

కార్యక్రమంలో సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ, చైర్మన్ గుంటి కృష్ణ, ప్రధానార్చకులు తిరుమలాచార్యులు, నాయకులు రాజు సుందర్, సుంకు రాంచందర్, బెజ్జంకి రాజేష్, మహేందర్, సాయి, దేవేందర్ పాల్గొన్నారు.



కట్టమైసమ్మ ఆలయంలో పచ్చరంగు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, తదితరులు

సంక్షేమ పథకాలు అందించేలా కృషి

సికింద్రాబాద్ నియోజకవర్గంలో పేదప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు లభించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అన్నారు. గురువారం సీతాఫల్‌మండి ఎమ్మెల్యే కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను, సీఎంఆర్ఎఫ్ క్రింద అందజేసే ఎల్‌ఓసీ పత్రాలను అందజేశారు. కార్పొరేటర్ సామల హేమ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ విలీనంతో కొందరికే ప్రయోజనం

● సాద కేశవరెడ్డి



సికింద్రాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పచ్చదనంతో స్వచ్ఛమైన గాలిని పీలుస్తూ జీవిస్తున్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ కావాలా, కాంక్రీట్ జంగిల్‌గా మారే కంటోన్మెంట్ కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు సాద కేశవరెడ్డి అన్నారు. జీహెచ్‌ఎంసీలో కంటోన్మెంట్‌ను విలీనం చేసే అంశంపై శుక్రవారం ఆయన తాడ్‌బంద్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. కంటోన్మెంట్‌ను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడం వలన కంటోన్మెంట్‌లోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే బహుళ అంతస్తుల భవనాలు వస్తాయని, దాని ద్వారా కొందరికి మాత్రమే ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ఆరోగ్యం పాడైతే లక్షలు, కోట్లు సంపాదించి ఏం లాభమని ఆయన ప్రశ్నించారు. జీహెచ్‌ఎంసీతో పోలిస్తే సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ప్రజలు హాయిగా జీవిస్తున్నారని, ఉద్యోగులకు ప్రతి నెలా సమయానికి జీతాలు వస్తున్నాయని అన్నారు. ప్రస్తుతం విలీనం అంశంపై రకరకాల ప్రచారం జరుగుతున్నదని, ఎటువంటి కంటోన్మెంట్ కావాలో ప్రజలే నిర్ణయం తీసుకోవాలని ఆయన అన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభివృద్ధికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నారని కేశవరెడ్డి అన్నారు. గెలిచిన వెంటనే కంటోన్మెంట్ సమస్యలు, అభివృద్ధి అంశాలను రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ఉన్నతాధికారుల దృష్టికి ఈటల తీసుకువెళ్లడమే దీనికి నిదర్శనమని అన్నారు.

కంటోన్మెంట్ విలీనంపై ఆందోళన



మీడియాతో మాట్లాడుతున్న పరశురామ్

సికింద్రాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): విలీనం జాబితాలో తొలుత లేనప్పటికీ, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసే అంశానికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుండడం ఆందోళన కలిగిస్తున్నదని కంటోన్మెంట్ బోర్డు ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి, బీజేపీ నాయకుడు పరశురామ్ అన్నారు. మారేడుపల్లిలోని తన నివాసంలో గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ దేశంలోని కంటోన్మెంట్లను పొరుగునే ఉన్న మున్సిపాలిటీలలో విలీనం చేసే అంశం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఎప్పటి నుంచో ఉందని, ఈ మేరకు జాబితా కూడా సిద్ధం చేసిందని చెప్పారు.

ప్రస్తుత పరిస్థితి చూస్తే సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను విలీనం చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలను సంప్రదించకుండా, ప్రజల అభిప్రాయాలను, సూచనలను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. జీహెచ్‌ఎంసీలో కంటోన్మెంట్‌ను విలీనం చేయడాన్ని తాను వ్యతిరేకించడం లేదని ప్రజలతో, కంటోన్మెంట్ ఉద్యోగులతో మాట్లాడి వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్న తర్వాతే నిర్ణయం తీసుకోవాలని తాను రక్షణ శాఖ మంత్రిని కోరినట్లు చెప్పారు. కంటోన్మెంట్ ఉద్యోగుల భవిష్యత్, పెన్షన్‌దారుల బాగోగులు, ఉద్యోగుల కారుణ్య నియామకాల గురించి ఆలోచించాలన్నారు.

ఐదు ముంపు గ్రామాలను

తెలంగాణ రాష్ట్రంలో విలీనం చేయాలి

● ఓయూ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం శ్రీరామ్

తార్నాక, జూలై 4 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో అంతర్భాగంగా ఉన్న ఎటపాక, పిచ్చికలపాడు, కన్నాయిగూడా, పురషోత్త పట్నం, గుండాల గ్రామ పంచాయితీలను తెలంగాణలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ ముంపు గ్రామాలకు చెందిన విద్యార్థి నాయకులు గురువారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఓయూ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం శ్రీరామ్ మాట్లాడుతూ.. కేంద్ర పునర్విభజన చట్టం ప్రకారం భద్రాచలంలోని ఐదు మండలాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విలీనం చేశారని, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు త్వరలో భేటీ కానున్న నేపథ్యంలో ఐదు ముంపు గ్రామాల సమస్యపైన చర్చించడంతో పాటు, శాశ్వత పరిష్కారం చేసి అక్కడి ప్రజలకు విముక్తిని కలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓయూ కన్వీనర్ నరేందర్, చల్లా శ్యాం, చంటి, గోపీ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఓయూఆర్ట్స్ కాలేజీ ముందు నిరసన వ్యక్తంచేస్తున్న ఓయూ జేఏసీ విద్యార్థి నాయకులు



దండోరా రజతోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు

దండోరా రజతోత్సవాన్ని విజయవంతం చేయాలి

తార్నాక, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న మాదిగ ఆధ్వర్యంలో ఈ నెల 7న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించనున్న దండోర రజతోత్సవాలలో మాదిగ, మాదిగ ఉపకులాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రాజేష్ మాదిగ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎంఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు దండోర రజతోత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని గురువారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు ప్రసాద్, దిలీప్, సాయి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

టీజేఎస్‌లోకి డాక్టర్ గుండ్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముదిరాజ్ మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గుండ్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్ తెలంగాణ జనసమితి (టీజేఎస్)లో సభ్యత్వం స్వీకరించారు. గురువారం పార్టీ కార్యాలయంలో టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ కండువా కప్పి శ్రీనివాస్ ముదిరాజ్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రొఫెసర్ కోదండరామ్ నేతృత్వంలో ముదిరాజ్ రిజర్వేషన్ల సమస్య పరిష్కృతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బైరి రమేష్, నిజ్జన రమేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు 3 గంటలు ఆలస్యం

హైదరాబాద్ సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం ఉదయం 6 గంటలకు హైదరాబాద్ నుంచి న్యూఢిల్లీ వెళ్లాల్సిన తెలంగాణ ఎక్స్‌ప్రెస్ మూడు గంటలు ఆలస్యంగా బయల్దేరుతుందని దక్షిణమధ్యరైల్వే ప్రకటించింది. గురువారం రాత్రికి న్యూఢిల్లీ నుంచి హైదరాబాద్ రావాల్సిన తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు ఆలస్యంగా నడుస్తుండడమే ఇందుకు కారణమని రైల్వే అధికారులు తెలిపారు. సిర్పూర్-కాగజ్‌నగర్ సమీపంలో ట్రాక్ మరమ్మతు పనులు జరుగుతున్నందున పలు రైళ్లు రద్దయ్యాయని, ముఖ్యమైన రైళ్లు సైతం గంటల కొలదీ ఆలస్యంగా నడుస్తున్నాయని చెబుతున్నారు.

7న మున్నూరుకాపు మహిళా ఎగ్జిబిషన్

● తెలంగాణ మున్నూరుకాపు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్

బర్కత్‌పుర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపు మహిళలకు ఆర్థిక చేయూతనందించడానికి ఈనెల 7న మున్నూరుకాపు మహిళా ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మున్నూరుకాపు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, ట్రస్ట్‌బోర్డు ట్రస్టీ పిల్లి శ్రీనివాస్ తెలిపారు. గురువారం కాచిగూడ మున్నూరుకాపు భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఎగ్జిబిషన్‌లో అన్ని రకాల వస్తువులు, పిండి వంటలు అందుబాటులో ఉంటాయన్నారు. మున్నూరుకాపు విద్యార్థి వసతిగృహం ట్రస్ట్‌బోర్డు సహకారంతో ఈ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నామని రాష్ట్రవ్యాప్తంగా మున్నూరుకాపు మహిళలు ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా మహిళలకు వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్నూరుకాపు మహాసభ మహిళా విభాగం అధ్యక్షురాలు శ్యామకురి సుజాత, ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ, కోశాధికారి ఆకుల జ్యోతి, ఉపాధ్యక్షురాలు జ్యోతిరాణి, మహాసభ కన్వీనర్ దండు నరేందర్, వెంకటేష్, సతీష్, ఆకుల యాదగిరి, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి దేవాలయ ఈవో బదిలీ

తిరుమలగిరి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): లాల్‌బజార్‌లోని మహంకాళి దేవాలయం ఈవో మహేందర్ రెడ్డి గురువారం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సత్యచంద్ర రెడ్డికి దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు బాధ్యతలు అప్పగించారు. శనివారం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు.

పలు ప్రాంతాల్లో నార్కొటిక్ వింగ్ పోలీసుల దాడులు

● 155 కిలోల గంజాయి స్వాధీనం

● ఎనిమిది మంది గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

హైదరాబాద్ సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసులతో కలిసి నగరంలో పలు ప్రాంతాల్లో హైదరాబాద్ నార్కొటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (హెచ్‌న్యూ) పోలీసులు దాడులు చేసి ఎనిమిది మంది గంజాయి విక్రేతలను అరెస్ట్ చేశారు. మూడు కేసులకు సంబంధించి నిందితుల నుంచి 155 కిలోల గంజాయి, స్కార్పియో కారు, పాసింజర్ ఆటో, 9 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఒడిషా మల్కాన్‌గిరికి చెందిన మంజిత్ థాలి అలియాస్ జీతు గంజాయి స్మగ్లర్. ఇతడు గతంలో పలు కేసుల్లో అరెస్టయ్యాడు. ఇతడు ఒడిషా మల్కాన్‌గిరి ప్రాంతానికి చెందిన అనిల్ ధానాజీ ఘూంటే, శుశాంత్ మిశ్రీ, సుమంత్ మండల్‌లతో కలిసి గంజాయి దందా చేస్తున్నాడు. పక్కా సమాచారమందుకున్న పోలీసులు వీరిని అరెస్ట్ చేశారు. మరో కేసులో ఆసిఫ్‌నగర్‌లో గంజాయి విక్రయిస్తున్న జి దేవరాజ్ సింగ్‌ను అరెస్ట్ చేశారు.

రౌడీషీటర్ గంజాయి దందా :

మంగళ్‌హాట్‌కు చెందిన ఎస్. లఖన్‌సింగ్ అలియాస్ లఖన్ అలియాస్ గోరుపై మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ రౌడీషీటర్ నమోదై ఉంది. హత్య, హత్యాయత్నం, బెదిరింపులు వంటి కేసుల్లో నిందితుడిగా ఉన్న లఖన్‌సింగ్ గంజాయి విక్రయాలు చేస్తున్నాడు. అతడిపై మూడు ఎన్‌డీపీఎస్ కేసులు ఉండటంతో పీడీయాక్ట్ కూడా నమోదు చేశారు. జైలు నుంచి విడుదలైన అతడు గంజాయి దందా చేస్తున్నాడు. లఖన్‌సింగ్ ఈస్ట్‌గోదావరి ప్రాంతానికి చెందిన చిన్న రాథోడ్ గోవింద్ వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్నాడు. హెచ్‌న్యూ పోలీసులు లఖన్‌సింగ్‌తో పాటు రాథోడ్ గోవింద్‌ను కూడా అరెస్ట్ చేశారు.



దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆనంద్ గౌడ్, చీర శ్రీకాంత్, తదితరులు

దొడ్డి కొమురయ్యను ఆదర్శంగా తీసుకోవాలి

● ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్

రాంగోపాల్‌పేట్, జూలై 4(ఆంధ్రజ్యోతి): రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన దొడ్డి కొమురయ్యను యువత ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీర సత్యనారాయణ (శ్రీకాంత్) ఆధ్వర్యంలో పాన్ బజార్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆనంద్ గౌడ్ ముందుగా దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి వాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజాకార్లు చేసే దౌర్జన్యాన్ని దొడ్డి కొమురయ్య చిన్నతనంలోనే ఎదురించి పోరాడాడని, అలాగే నేటి యువత టెర్రరిజానికి వ్యతిరేఖంగా పోరాడాలన్నారు. అంతకుముందు చీర సత్యనారాయణ మాట్లాడుతూ ఆయన ఆశయాలు, ఆలోచనలు, ఆయన ఆవేశం అందరికి ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంజయ్ ఘనాథే, ప్రధాన కార్యదర్శి నందనం నందకర్, కోశాధికారి ఆకారం రమేష్, కార్యాలయ కార్యదర్శి శరత్ ఠాకూర్, సహ కార్యదర్శి ప్రభు పూజారి, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎస్.వి.నరేష్, డివిజన్ ఓబీసీ మోర్చా అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శి శ్రీనివాస్ కుమార్ యాదవ్, ప్రవీణ్ కుమార్, నరేంద్ర పాల్, హెచ్.శ్రీనివాస్‌లతో పాటు పలువురు బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.



హోంగార్డ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు

హోంగార్డ్ కుటుంబానికి ఆర్థిక సాయం

తిరుమలగిరి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న సిబ్బందిని అన్ని విధాలుగా ఆదుకుంటున్నామని తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో వరంగల్‌కు చెందిన హోంగార్డ్ రాకేష్ పనిచేస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితం అయ్యారు. విషయం తెలుసుకున్న ఇన్‌స్పెక్టర్ తోటి ఉద్యోగుల సహకారంతో రూ.50 వేలు సేకరించి రాకేష్ కుటుంబ సభ్యులకు గురువారం



ఈస్ట్ మారేడుపల్లి లోహియానగర్ బస్తీకి చెందిన వెంకటమ్మ అనే వృద్ధురాలు కొంత కాలంగా వినికిడి లోపంతో బాధపడుతున్నది. ఈ విషయం తెలుసుకున్న మారేడుపల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ సి.సంతోష్ యాదవ్ వృద్ధురాలికి రూ.20 వేల విలువ చేసే వినికిడి లోపం నివారణ పరికరాన్ని అందజేశారు.

-మారేడుపల్లి, ఆంధ్రజ్యోతి



హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) 3వ మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ ఆ సంఘం అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షుడు గౌరి నాగరాజు గురువారం తుకారాంగేట్‌లో బ్యానర్‌తో ర్యాలీ నిర్వహించారు. కార్మికుల హక్కులు పోరాటంతోనే సాధ్యమవుతుందని ఆయన అన్నారు.

-అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి

ఫేక్ కాల్ చేసిన యువకుడికి రిమాండ్

రెజిమెంటల్‌బజార్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): హోటల్‌లో బాంబు ఉందని ఫేక్ కాల్ చేసిన యువకుడిని మార్కెట్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న అల్ఫా హోటల్‌లో బాంబు ఉందని డయల్ 100 కాల్ చేశాడు. అప్రమత్తమైన మార్కెట్ పోలీసులు, బాంబు స్క్వాడ్ తనిఖీలు చేసి ఫేక్ కాల్‌గా గుర్తించారు. వెస్ట్ బెంగాల్ మాల్దాకు చెందిన షేక్ నసీమ్(21) శంశాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. జులాయిగా తిరుగుతుండే షేక్ నసీమ్ ఫేక్ కాల్ చేసినట్లు గుర్తించిన పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

యువకుడి అదృశ్యం

బోయిన్‌పల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మర్రిరామ్‌రెడ్డి కాలనీలో చోటు చేసుకుంది. ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం... బోయిన్‌పల్లిలోని మర్రి రామ్‌రెడ్డికాలనీలో నివాసం ఉంటున్న ముఖేష్ సెంచ(24) కుటుంబ సభ్యులతో కలిసి ఓల్డ్ బోయిన్‌పల్లి బృందావన్ కాలనీలో కిరాణ దుకాణం నడిపిస్తున్నాడు. ఇతనికి 2022లో రాజస్థాన్‌కు చెందిన హేమతో వివాహం జరిగింది. ముఖేష్ సెంచ రెండు రోజుల క్రితం ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అతని ఫోన్ కూడా కిరాణ దుకాణంలోనే వదిలేసి వెళ్లాడు. దీంతో ముఖేష్ సెంచ కోసం తెలిసిన వారిని, బంధువులను ఆరా తీసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులు గురువారం బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



బాలుడిని చైల్డ్‌లైన్‌కు పంపిస్తున్న జీఆర్పీ పోలీసులు

ఇంటి నుంచి పారిపోయి వచ్చిన బాలుడు

● చైల్డ్‌లైన్ హోంకు అప్పగింత

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి పారిపోయి వచ్చిన ఓ బాలుడు రైల్వే స్టేషన్‌లో తిరుగుతుండగా జీఆర్పీ పోలీసులు చేరదీసి చైల్డ్ లైన్ హోంకు అప్పగించారు. సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో గురువారం ప్లాట్ ఫాం నంబరు 10లో జీఆర్పీ ఎస్సై రమేష్, మహిళా కానిస్టేబుల్ మున్ని తనిఖీలు చేస్తుండగా పదకొండేళ్ల బాలుడు రైల్వే స్టేషన్‌లో తిరుగుతుండగా పట్టుకున్నారు. వివరాలు సేకరించేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

రాంగోపాల్‌పేట్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం సెక్రటేరియేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... న్యూ మల్లేపల్లి గోకుల్‌నగర్‌కు చెందిన టి.మనోహర్ (32) ఫొటో గ్రాఫర్‌గా పని చేసేవాడు. 2018లో సిందూరతో వివాహం జరిగింది. వీరికి ఒక అబ్బాయి, ఒక అమ్మాయి ఉన్నారు. ఇటీవల ఆర్థిక సమస్యలు చుట్టుముట్టాయి. దీనితో ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. బుధవారం అర్ధరాత్రి ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. దీనితో కుటుంబ సభ్యులు హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గురువారం ఉదయం ట్యాంక్‌బండ్‌పై ఉన్న పింగళి వెంకయ్య విగ్రహం ఎదురుగా హుస్సేన్ సాగర్ జలాశయాలలో తెలుతున్న మృతదేహాన్ని గుర్తించిన సెక్రటేరియేట్ పోలీసులు సంఘటనా స్థలం వద్ద ఉన్న ద్విచక్ర వాహనం నంబర్ ద్వారా మృతుడు టి.మనోహర్‌గా గుర్తించి బంధువులకు సమాచారం ఇచ్చారు. సెక్రటేరియేట్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.